# ఒంటరి బంగళా

హోరున గాలి వీస్తోంది.

పైన అంతా మబ్బు కమ్మి కన్ను పొడుచుకున్నా ఏమీ కానరావడంలేదు. ఎనిమిది గంటల రాత్రప్పుడు జనసంచారం ఏమీ లేకుండా-బొత్తిగా క్షీణించినట్లు అనుకునేందుకు వీల్లేకుండా, ఉండీ ఉడిగీ ఓ ముసుగేసుకున్న రిక్షా, తరువాత పదినిముషాలకు ఓ సైకిలు, బాగా విరామమిస్తూ ఘల్లుఘల్లుమని సన్నగా ప్రారంభించి జలజలమని పారే బురదనీటిని డెక్కలతో చిందగొడ్తూ ఎక్కడికో చీకట్లో-అంతర్ధానమయ్యే ఓ జట్కా వీట్లను గమనిస్తూ మధ్యను ఓమాటు బంగళా గేటువైపు దృష్టిని విసిరి తిరిగి ఆ నిశ్శబ్దంలో అద్దాల గాజుపలకలమీది నీటిని తొలిగిస్తూ ఆ గుడ్డను బాల్చీలోకి పిండుకుంటూ తన పనిలో మునిగిపోసాగాడు ధర్మయ్య.

ఆ ఒంటరి హాల్లో జాగ్రత్తగా అమర్చిన బల్లలు కుర్చీలు అలవాటులేని నిశ్శబ్దానికి గింజుకొంటున్నట్లున్నాయి.

ఎక్కడో పిడుగుపడింది. ఆకాశం ఉఱిమి గర్జనలు చేసింది. ఒక్క మెఱుపు మెరిసి కొండలు, వూరు, చెట్లు, అన్నీ తళుక్కుమన్న కాంతిలో మిలమిలలాడాయి.

బంగళా ముందు తోట అంతా నీళ్లతో ముంచెత్తి అంతక్రితం జాగ్రత్తగా, నడవటానికి చేసిన దారులు మొక్కలకు త్రవ్విన బోదెలు కట్టిన కంచెలు సర్వం కొట్టుకుపోయినై.

-వాన తగ్గలేదు. కాని ఉధృతం కాస్త సడలింది.

రోడ్డుమీద దూరాన ఎలక్ట్రిక్ దీపాల వెల్తురు ప్రసరించిన చోట్లలోమాత్రం తూము కాలువలు నిండిపోయి నీరు సవ్యాప సవ్యంగా రోడ్డుమీద పరుగులెత్తటం చూడవచ్చు.

ఆ ఒంటరి బంగళాయొక్క దీపాలులేని క్రింది చీకటిహాల్లో, నుంచి ఒక జాతికుక్క పదేపదే భయంకరంగా అరుస్తూ మొరుగుతూ ఆ ఆవరణలోని నిశ్శబ్దాన్ని చీల్చి

చెండాడుతోంది. దాని అరుపు విన్నప్పుడు మాత్రం ధర్మయ్య ముఖం కొద్దిగా వివర్ణమవుతోంది. తుడుస్తున్న గాజుపలకమీది చేతిని అట్టా ఆనించి భయంతో బంగళాగేటువైపొక చూపు విసిరి నిట్టూరుస్తున్నాడు. ఆ హాల్లోనికి మూసిన ద్వారాలతో వరుసగా ఏర్పాటుగాఉన్న చక్కటి మూడుగదులు-వాటి గుమ్మాలకు కిటికీలకు పొందికగా కట్టిన తెరలు గాలిలో స్వేచ్ఛకోసం పెనుగులాడ్తూ కదలాడ్తూండగా-

"ఆ వెధవ కుక్క ఎందుకలా మొరుగుతుంది?" అన్న గర్జన.

ప్రకృతిలోని ఈ సంక్షోభం చీదరపాటువలన కలిగిన కోపమంతా ఆ కంఠంలో ఆ కుక్క మీద ద్వేషంగా రూపుమార్చుకుంటోంది. బుజంమీది గుడ్డను తలకు చుట్టుకుని ధర్మయ్య ఊగుతూ నెమ్మదిగా చెక్క మెట్ల మీదినుంచి దిగువకు జారుకున్నాడు. తరువాత మేడమీది హాల్లోని చీకట్లో ఎర్రగా వెలిగి నుసిగ్రమ్ముతూన్న పైపుతో ఒక నల్లటి నీడ ఇట్నుంచి అటూ అట్నుంచి ఇటూ తచ్చాడుతూండటం బంగళా గేటువద్దనుంచి కూడా జాగ్రత్తగా పరిశీలిస్తే అగుపడొచ్చు.

పనిలేని వీధికుక్కలు 'భంయ్'మని అరుచుకుంటూ దారి వెంటపోయే ఒక చీకిన గోనెల్లో తడిసిన ముష్టివాడ్ని ఆగిఆగి నిలబడి వెనుక నుంచి తరుముతూండగా వాడు కంకరరాళ్లతో బెదరిస్తూ గోల చేసుగుంటూ పరుగెత్తుతున్నాడు. ఈ మధ్యలో హఠాత్తుగా ఎక్కడ్నుంచో ప్రారంభమయిన గుఱ్ఱపుడెక్కల ధ్వనిలో కంకర రాళ్ల చప్పుడు లీనంకాగా, అసాధారణమైన వేగంతో పరుగెత్తి వచ్చిన ఒక బలిష్టమైన గుఱ్ఱం పూర్తిగా తడిసిపోయిన బండిని వేగాన్ని తగ్గించుకుంటూ లాక్కునివచ్చి, ఆ నీళ్లలో బంగళా గేటువద్ద ఆగింది.

ముష్టివాడ్ని తరిమివచ్చిన కుక్కలు గుఱ్ఱపుబండీ చుట్టూ నిలబడి చోద్యం చూస్తున్నాయి. తలగుడ్డతీసి బుజానికి లాక్కుని బంగళాగేటువద్ద నిలబడిపోయి గొంతుక పూడుకుపోగా 'చినబాబుగారూ' అని మాత్రం అనగలిగాడు ధర్మయ్య. ఆ బండికి కట్టిన దీపం బుడ్డిలోకి కొద్దిగా నీరు చిందటం వల్ల చిటపటమనే చప్పుడు, చమురుగుడ్డ కాలిన వాసన వెలికిరాగా, ఎవరూ అడక్కుండానే 'కలకత్తామైలు గంట నేటు బాబూ-' అన్నాడు సామాన్ను జేరవేస్తున్న బండివాడు. బండిలోంచి దిగిన వ్యక్తి రబ్బరు వాన కోటుమీదనుంచి కారుతున్న నీటిని వొక్కమాటు దులుపుకుని ఆ గేటును తోసుకు బంగళావైపు నడిచాడు.

బంగళా పై హాల్లోని అద్దాల గాజు తలుపులు తెర్చుగున్నాయి. ఎర్రటి పైపు నల్లటి నీడ ముందుకు త్రోసుగునిరాగా ఆ కంఠం నుంచి వచ్చింది 'ఎవరది?' అన్న ప్రశ్న.

మరొకమారు బంగళా క్రింది కుక్క మొయ్యోమని అరిచింది.

ధర్మయ్య వెనుకనుంచి, 'చినబాబుగారు పూర్తిగా తడిసి పోయారు' అని గొణుక్కున్నాడు. పైనుంచి చేత్తో నోట్లోని పైపును తీసి పట్టుకున్న చీకటినీడ పిల్చిన 'రాజూ-' అన్న గంభీరమైన పిలుపుకు యీ వచ్చినవ్యక్తి 'హ్హా' అని మాత్రం జవాబు ఇవ్వగలిగాడు.

అద్దాల గాజుపలకల తలుపులు ఒక్క మాటు మూసుగున్నాయి.

రాజు క్రింది వరండాలోని ప్రాతగిలిన కుర్చీ కాలికి తగులగానే వానకోటును తీసి దాని మీదకు విసిరి తల తడుముకుని రెండు చేతుల్తో జుత్తును పిండుకోసాగాడు. నీళ్లు టపటపమని నేలమీద చిందుతున్నాయి. బండివాడు ఇక ఎవర్నీ అడగనవసరం లేకుండానే చిరపరిచితుడులా సామాన్ను మీదకు చేరవేసి వెళ్లిపోయాడు.

'పైకి నడవండి బాబూ' అన్న నవుకరు మాటలు వినిపించుగోకుండానే 'తాళాలుతియ్యి ధర్మయ్యా, ఇల్లంతా చూడాలి' అన్నాడు రాజు.

హాల్లోని కుక్క బైట మనుష్యుల అలికిడికి గింజుకుంటోంది అరుస్తూ, కిటికీమీద కౌలునుమోపి 'జిమ్మీ' అని పిలుస్తూ చిటెకెవేశాడు. క్రింద లైట్లన్నీ ఒక్కమారు వెలిగాయి. ధర్మయ్య క్రింది హాల్లోకి తలుపుల్ని తీసి ప్రక్కగావచ్చి నిల్చున్నాడు. రాజు చరచరా కుక్కను గట్టిన గొలుసు దగ్గరకు వెళ్లగానే లోతుకు దించుకుపోయిన కళ్లు దవడలతో 'జిమ్మీ' మీదమీదకు ఎగుర్తూ నాకుతూ ఆప్యాయతను ప్రదర్శించింది.

ఇల్లంతా చెల్లాచెదరుగానూ నానా కంగాళీగాను ఉన్నట్లుంది..

'పిన్ని ఎక్కడ జిమ్మీ' దుఃఖంతో రాజు గొంతుకు బొంగురుపోయింది.

ఎక్కడ పడితే, అక్కడ అనవసరపు సామాను-మంచాలు అడ్డదిడ్డంగా పడిఉన్నాయి. పరుపులు తలగడాలు కొన్ని క్రింద కొన్ని కుర్చీల్లోనూ వివిధ రకాల మందు సీసాలు మూతలు తీసినవి ఖాళీవి ఎక్కడ పడితే అక్కడ దొర్లుతున్నాయి. కంగారులో తీసిన అలమారా-బీరువాల తలుపులు వేసేందుకు ఎవ్వరూ లేరు. నేలమీద మందు నీళ్లు పళ్లరసాల చారికలు ఎండిపోయి మచ్చలు కట్టాయి. గ్లాసులు చెంబులు నీళ్లబిందెలు, అన్ని వైపులా చిందర, వందరగా ఎక్కడ పడేసినవి అక్కడ అట్లానే వున్నాయి. ఒక కాళీ మంచంవద్ద మాత్రం తలవైపున జాగ్రత్తగా అమర్చిన టేబిలు ఫాను, వొంటరిగా దిగులుగా నేలకు దిగజారిన వైరుచుట్టతో గది అంతా పొంచి చూస్తున్నట్లుంది.

"ఈ ఇంట్లో ఎవరూ ఎప్పుడూ సుఖపడలేదు ధర్మయ్యా'. బైట గాలీ-వానా అంతా తగ్గి ప్రకృతి ప్రశాంతతను తిరిగి కోలుకొంటోంది.

'పిన్ని నా గురించి ఒక్క ముక్క అన్నా చెప్పిపోలేదా ధర్మయ్యా?'

రాజు తల వ్రేలాడేసుగుని సోఫాలో కూలబడ్డాడు. ధర్మయ్య పొడిబట్టల్ని చేత్తోపుచ్చుకుని ప్రక్కను నిలబడ్డాడు. వేడి కాఫీ పొగలు గ్రక్కుతూన్నది అలానే బల్లమీద వుండిపోయింది.

## 2

మనస్సు గుర్రంలా పరిగెడ్తూంటే, వయస్సుని కాలాన్ని చూసి సాంఘికధర్మం 'ఛీ' అని కసిరిగొడ్తే - 'వృత్తికి న్యాయవాదవే గాని జీవితంలో అన్యాయాల్ని సమర్థించుకొంటున్నారని కన్నకొడుకు తీవ్రంగా ఎదిరిస్తే, కన్నీళ్లు ఆకలి దుర్భర దారిద్ర్యం ఎటువంటిదో రుచిచూడకపోయినా-కానివయస్సులో చిలిపితనమనిపించుకున్నప్పటికీ,

హృదయానికి పదుచుతనపు పోకడలు రప్పించుగుని, బీటలువారిన జీవితంలో నందనవనవాటికను నిర్మించుకుని, అమృతవర్షం కురిపింపచెయ్యాలనీ, జీవితాకాశాన కోరికల మబ్బు గుర్రాలసవారీ సాగించాలని-లోకంతో పోరాడి 'ఆనందము-స్త్రీ' గిరిగీసినట్లు కుర్రవాళ్లకే హక్కు భుక్తాలు కావని వొప్పించబోతే- 'ఈ భోగభావాన్ని పెంచుగుని జీవితాలమీద అక్రమంగా దాడి చెయ్యకపోతే, ద్రవ్యాన్నీ పరువునీ ప్రతిష్టల్నీ విరజిమ్ముకొని ఎదుటివారి దురవస్థల్లో చేజిక్కించుగున్న అవకాశాలతో దారుణావమానాలు చేయకపోతే-తమకన్నా చిన్నవాళ్ల జీవన యమునాతీరంలో తాజమహళ్లను కట్టి ఇవ్వరాదా? చరిత్ర-కళలూ, సంఘమూ, ప్రవహించే దిక్కున గోచరించే ఏకైక లక్ష్యం మానవాభ్యుదయమే! సాంఘికధర్మాలు న్యాయమూ చట్టమూ అన్నీ అటువైపుకే! భవిష్యత్తుమీద మన ముందుతరంమీద విశ్వాసం లేని వాళ్లు చేసే ఆత్మబలిదానం దేశానికి అక్కరకు రాదు. ఎడారిలో నడుస్తూ మిఠాయిల్ని తల్చుకుని నోళ్లలో నోరూరించుకొంటూ వెనక్కు వెనక్కు పరుగెట్టే అసూయాగ్రస్తులు వెనకటి రోజులే బాగున్నాయి. కాలం మారింది ప్రపంచం చెడిపోయిందని తిట్టూంటారు. ఈ యుగసంధిలో యీ గతితార్కిక భావసంఘర్షణ సమ్మర్దంలో, ఆవేశాలకావేశాల సంకులసమరంలో-మేడమీద న్యాయవాది తండ్రి రామదాసు పంతులు, క్రింద కొడుకు చోటా న్యాయవాది రాజేశ్వరరావు-ప్రత్యర్థులుగా నిలబడ్డారు.

పిట్ట చేతిలోంచి ఎగిరిపోతే వ్రాలిన చిత్రాంగి మేడలో దూరి 'పావుర మియ్యవె పిన్నమ్మా నా-' అనైనా అనకుండానే, రాజేశ్వరరావు, చెరగని అవమానాన్ని అభాండాల భాండాల విషాన్ని ఒలకబోసుకున్న ఆ బంగళాలోకి వచ్చి 'పిన్ని నాగురించి ఒక్క ముక్క అన్నా చెప్పి పోలేదా ధర్మయ్యా' అని అడిగాడు.

ఈ భయంకర భీతాసహ కథాకథనంలో ధర్మయ్య పంచశీల మరమేకులా చుట్టుకుని ముందుకు నెట్టుకువచ్చాడు. కాని...కానైతే...ఇప్పటి కిది జరిగి ఓ దశాబ్దమైఉంటుంది. నూరేళ్లు బ్రతకాలనీ, పండ్లంటి పిల్లాపాపలతో వెయ్యేళ్ల కాపురం వర్ధిల్లాలనీ, నొసట కుంకుమ రేఖలు దిద్ది బుగ్గచుక్కెట్టి, ఒళ్ళో కొబ్బరిబొండాన్నుంచి, అల్లుడిచేత చేతిలో చెయ్యేయించుకుని, కందపిలకనోము నోపించి 'పోయిరావమ్మ జానకీ' అని సన్నాయిమేళం వాళ్లు పాడుతుండగా-కన్నీళ్లతో తమ సర్వస్వాల్ని బిడ్డల భవిష్యత్తుకై సంతోషంతో అంకితమిచ్చే కన్నవారు ఉన్న వారుగాక పోవటంచేత అంతమైన రాధ జీవితకుసుమం ఎడారిలోపడి నలిగి ఎండి కృంగి కృశించిపోయింది. చెదరిన ముంగురులతో, బెదరిన కళ్లతో తడబడ్తూ తడబడ్తూన్న కాళ్లతో, గలగలమని చప్పుడు చేసుకుంటూ, ఇంట్లోకి వచ్చి కలకలమనిపించిన ఈ అందాలబాలను 'పిన్నీ' అని పిలవాల్సొస్తుందని ఊహామాత్రంకూడా శంకించలేకపోయాడు రాజు. శంకించవలసిన ఝంఝూటమైపోయాక కూడా తండ్రి తన్ను బహుచమత్కారంగా క్రూరమైన అపనింద అవమానాల పాల్చేసినప్పటికీ, ఏ కన్నీటిని

కాలుష్యాన్ని రాధకు దూరం చెయ్యాల్సిన విధి వేయి గొంతుకలు విచ్చినట్లుగా, నదులన్నీ పొంగి కట్టల్ను త్రెంచుకుని ఉరికినట్టుగా, ఉద్రేకం ఉత్సాహం పొంగిపోయి, కొంపా గోడూ వదిలిపెట్టి, చదువూసంధ్యా, వృత్తి, అంతస్థు ఉద్యోగం, హోదాలకు దూరంగా నెట్టివేసి పారిపోయేట్లు చేసిందో, ఆ శ్రమా-ఆవేశం అంతా వ్యర్థం నిష్ఫలమైపోయేసరికి, పరాజితుడిలా ఆ ఒంటరిబంగళాలో శ్మశానాల ప్రశాంతత తాండవిస్తూన్న ఆ నైరాశ్యపు నిశీథ వాతావరణంలో, 'జిమ్మీ' భయంకరంగా అరుస్తూంటే-మేడ దిగి ఈవలకురాని రామదాసుపంతులుయొక్క అవిరామ పదధ్వనులను ఆలకిస్తూ రాజేశ్వరరావు చిత్రించిన రాధాదేవి అమాయిక మనోహర ముఖకమలాన్ని మన్ణఫలకంమీద చిత్రించుకోసాగాడు.

ఠంగు ఠంగుమని గడియారం రెండుగంటల్ని కొట్టింది. రాజు చటుక్కున లేచి దుస్తుల్ని సంబాళించుకొని రబ్బరుకోటును మీద కప్పుకుని 'ధర్మయ్యా' ఆగి 'తాళాలు కావాలి' అని గర్జించాడు. ఇద్దరూ బంగళావదిలి షెడ్డువద్దకువచ్చి నిలబడ్డారు. తలుపులు తెర్చుకున్నాయి. కారు ఈవలకు వచ్చింది. 'ఎక్కు' అన్నాడు రాజు. కారుతలుపుమీద ధర్మయ్య చేయి వేయబోయాడు. 'ఎక్కడికి' అన్న గర్జన మేడమీంచి వచ్చింది. 'శ్మశానానికి' అన్న మాటతోబాటు వెలికివచ్చిన కారు త్రాచుపాములా నీళ్లను రాళ్లను దూసుకుంటూ నిర్మానుష్యమైన జనపథంగుండా చీకట్లోకి పోయి అంతర్హితమైంది.

శ్మశానంలో, రెండు క్రొత్తశవాలు కాల్తున్నాయి. ఆ తాలూకు మనుష్యులు దూరంగా గుంపుగా నిలబడి చూస్తున్నారు. సుదూరాన కట్టెలఅడితి గొంతిక కూర్చున్న రాక్షసిలా చీకట్లో వికృతంగా అగపడ్తోంది. శ్మశానంలోని ఎర్ర ఆకుపచ్చరంగు మంటలు ధూమం పైకిలేచినప్పుడు-బూడిద కుండపెంకులు రాళ్లు కొరకంచులతో ఆ నేల భీతావహంగా దర్శనమిస్తున్నది. దూరంగా యేరు నిద్రపోతున్నది. అక్కడా అక్కడా పొంచిచూస్తున్న నక్కలు వికృతంగా గానం చేస్తున్నాయి. కాటికాపరి చేతిలో కర్రతో నిర్వికారంగా నిలబడి ఖాళీగా చూస్తున్నాడు. కారు నేరుగా వచ్చి శ్మశానంలో ఆగింది. ఇద్దరూ బయటకు దిగి నెమ్మదిగా రాధాదేవిని ఖననం చేసినచోటుకువచ్చి ఆగారు. ఏమీమిగలకుండా తెల్లటి నురుసులాటి బూడిద తడిసిపోయిన వాననీటిలో చితపతలాడుతూన్న అయిదడుగుల మేరను వంగుని చేత్తో బురదను ఆప్యాయంగా ప్రోగుచేస్తూన్న రాజును బుజంమీద తడ్తూ 'ఇదేమిటిది? మీకేం పిచ్చా చినబాబుగారూ?' అని ధర్మయ్య వెనక్కులాగాడు.

'పిన్ని యిక్కడ నిద్రపోతోంది' అని మునివ్రేళ్లను బురదలో పూతంగా ఆన్చి 'నీకోసమే యిల్లువిడిచి పారిపోయానుగా పిన్నీ-అప్పుడే వెళ్ళిపోయావా? రుజువుచెయ్యలేని అవమానాల్ని చెరగనిమచ్చగా మోసుగుంటూ తిరగమన్నావా నన్ను.'

ధర్మయ్య శారీరకబలమంతా ఉపయోగించి రాజును గుంజుతూ 'పిచ్చిపన్లు చెయ్యకండిక. పోదాం-ఇంటికి.'

'ఇంటికా-రాను. అక్కడకన్నా యిక్కడ చాలా ప్రశాంతంగా హాయిగా వుంది.'

'రండి'- ధర్మయ్య బలవంతాన రాజును లాక్కుంటూ షెడ్డులోకి తీసుకునివెళ్ళాడు. రబ్బరుకోటు పంట్లాం అంచులు బురదబురదయాయి. రాజు ముఖం ప్రక్కకు త్రిప్పుకొని ఏడుస్తున్నాడు.

శవాలు పూర్తిగా కాలిపోయాయి. బందుగులు ఇళ్లకు వెళ్లి పోయారు. కాటివాడు రెండుచేతుల్తో ఖాళీపాడెల్ను సగంకాలిన కొరకంచుల్ని బురదలో ఆర్పి కట్టెల్ను ప్రోగుచేసుకుంటున్నాడు. ఎవరో చితుకు లేరుకొనేపిల్లలు వచ్చి ఈ ప్రోగునాది ఈ ప్రోగునాది అని తగూలాడుకుంటూ బొగ్గుల్ని తట్టల్లోనూ బుట్టల్లోనూ ఏరుకొని వేసుగుంటున్నారు. తెల్లవారవచ్చింది. ధర్మయ్య 'లేవండి-రాధాదేవి ఆఖరికోరిక తీర్చివద్దాం పదండి. ఇంకా తెల్లవారటానికి రెండుగంటలుందికదూ-చాలు ఆ వ్యవధి.'

'ఆఖరికోరికా' కోరికలేమీ ఉండవనుకున్నానే.'

ఇద్దరూ నడచివచ్చి కారులో కూర్చున్నారు. ధర్మయ్య సందేహిస్తూ-

'ఈరోజు ఎల్లా వానకురిసి చిందరవందరగా ఉందో ఆనాడు సరిగ్గా ఇల్లానే కారు ముందుకు పోతుందా అని సందేహించాం. పోకపోయినా బాగుండిపోయేదేమో....'

రాజు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. కారు చక్రాలు వేగంగా చుట్లుతిరుగుతూ నీళ్ళను రాళ్లను పల్లాల్ని గతుకుల్నీ దాటి పరుగులు బెడ్తోంది.

'ఆ ఇటువైపే-తిన్నగా....బస్. రోడ్డు బాగానే ఉంది. చూడండి చినబాబుగారూ- మీరు కలకత్తాలో చదువుకొంటున్నారు. బ్యాంకులో చెప్పి నెలనెలా మీకు చెక్కు పంపే ఏర్పాటు చేసేశారు నాన్నగారు. మీకు అమ్మగారు గుర్తున్నారా? ఆవిడే పోకపోయుంటే నాన్నగారు మీ అతీ గతీ పట్టించుగోక పోయేవారంటారా?'

రాజు తల్లిని గుర్తుచేసుకుందామనేసరికి ఏమీ స్ఫురణకు రాకపోగా బంగళాలోని గదిలో నాన్నగారు హోదాకు వ్రాయించిన నిలువుసైజు తైలవర్ణ చిత్రం ధర్మయ్య మాట్లాడుతూంటే-ఆ బొమ్మకు ఎదురుగ్గా నిల్చొని అనేకసార్లు ఆప్యాయతను కోరి తెచ్చుకోబోయి విఫలమయిన సందర్భాలు మనస్సులో మెదిలాయి.

'మిమ్మల్ని అమ్మగారు పోగానే కాన్వెంటు దొరసానిని పిలచి అప్పగిస్తూంటే వద్దని, లబలబలాడేను. ఆపేక్ష లాలన ప్రేమాభిమానాలకు దూరం చేస్తున్నారని గొడవచేస్తే వీడ్ని కనిపెట్టుకొని సాకటానికి ఇక్కడ ఎవరున్నారు? డబ్బు పారేస్తే సురక్షితంగా శిక్షణలో పెంచుతారు వాళ్లు అని నా నోరు మూయించేశారు.' రాజు కొంచెం కొంచెం చెప్పుగోనవసరంలేని తన బాల్యాన్ని నెమరువేసుగుంటున్నాడు. ఎప్పుడూ పండగలూ శలవలూ ఇళ్లకు వెళ్లడం అనేది ఎరగడు. ఎవరోవచ్చి ఎక్కడకో తీసుగెళ్ళటం ఆపేక్ష అభిమానాలు చూపించటం తనెరగడు. ఈ ధర్మయ్యే నెలకోసారి వచ్చి చూసి కంట

తడిపెట్టుకొని వెళ్లిపోతూండే వాడు. ఎప్పుడో ఏ మూణ్ణెల్లకో వచ్చి చూసి వెళ్లిపోతూ ఉండేవాడు తండ్రి. కాలేజీలో చదువుకునేటప్పుడు కూడా శలవుల్లో అన్ని పండగల్లోనూ హాస్టల్లో హోటల్లో ఉండేవాడు తనొక్కడే. తనకెప్పుడూ ఎక్కడ్నుంచీ వుత్తరాలు రావు. వస్తే గడియారాల కేటలాగులూ పుస్తకాల వ్యాపారస్థులు ఏదన్నా సందర్భంలో వ్రాసినవి మినహాయించి. ఒడిదుడుకులు ఉద్రేకం ఆవేశం అభిమానమూ చూడని రసహీనమైన జీవితంలోకి అర్ధాంతరంగా వచ్చి తొంగిచూసిన మొదటి స్త్రీవ్యక్తి 'రాధాదేవి'.

తెలతెలవారుతోంది. పిట్టలు కిచకిచమని గోలచేస్తున్నాయి. పల్లెలనుండి పట్టణాలకి తరలివెళ్ళే పల్లె వనితలు పాలకావిళ్లూ పెరుగు తట్టలవాళ్ళూ దారిలో ఎదురవుతున్నారు.

'ఆవేళ మీసాల పాపారావు డ్రైవు చేస్తున్నాడు కారును. నాన్నగారే అతడ్ని ఉద్యోగంలోంచి తప్పించేశారు. మీకు తెలుసా?'

'కొంచెం విన్నట్లు గుర్తు-చూశానేమో, చూసేఉంటాను కూడా-'.

'పాపారావు అమ్మగారి హయాంలో మంత్రి. పూజలు పురస్కారాలు ఉత్సవాలు ధర్మకార్యాలు అన్నింట్లో విశేషంగా పాల్గొంటూ ఆ హయాంలో మీ ఇంట్లో ఒక వెలుగు వెలిగించి, అటుదిటు తిరిగి కాలం మారగానే అనవసరపు మనిషయి తొలగించబడ్డాడు. నాన్నగారు చిత్రమైనమనుష్యులు సుమండీ! ఆయన స్వభావానికి ఎప్పుడూ ఏది తడుతుందో, ఎవరు ఎప్పుడూ అనవసరమైపోతారో, ఏది ఎందుకు తప్పనిసరిగా మారిపోతుందో ఊహించటం కష్టం. ఆయన మార్గానికి ఏది కంటకమైతే దాన్ని సుళువుగా తొలిగించేస్తారు. అతనిప్పుడు రూటుమీద బస్సులు నడుపుతున్నాడు. ఈమారెప్పుడైనా కనుపిస్తే మిమ్మల్ని చూపిస్తే తప్పక సంతోషిస్తాడు. ఎంత ఎత్తుకు మోసేవాడని-'

రాజు ధర్మయ్య కేసి చూసి 'అవును నిజం. ఏది మార్గానికి అడ్డు తగుల్తుందో దాన్ని సుళువుగా తొలగించి పరిష్కారం చేస్తారు. ఆయన నన్నూ మార్గానికి దూరంగానే ఉంచగలిగారు కాని పరిష్కారం అంత సుళువుకాదు.'

దారి కిరుప్రక్కలా దట్టంగా పెరిగిన ఎత్తైన కొమ్మలు రెమ్మల సందులనుంచి లేతవాడి సూర్యకిరణాలు దారిమీద పడి తడిసిన బాటలో బంగారుఛాయల్ను చిమ్ముతూండగా కారు జర జరా బరిమీద పాములా సర్న పోతున్నది. చిన్న చిన్న కుగ్రామాలు పల్లెలు గుడిసెలు అర్ధనగ్న మానవుల దీనదేహాలు, మెళ్లో రంగుల పూసలు వంటిమీద చింకి పేలికలు, చంకలో నిసువులు శిశువులు, నెత్తిమీద తట్టలు-తట్టల్లో బొచ్చెలు 'కుండలు,' చేతుల్లో పనిముట్లు-పారలు పలుగులు కొడవళ్లు, నెత్తిన మోపులు వెనుక మేకలు కుక్కలు దున్నపోతుబండ్లూ, ఎడ్లమందలు-అరుపులు తిట్లు పాటలు కొట్లాటల కోలాహలమంతా గడిచి రాజు దూరాన తెల్లటి చారలూ పెంకుటిళ్ళూ దేవుడిగుడి పెద్దమేడతో ఓ గ్రామాన్ని పోల్చుకొంటూ ధర్మయ్య కేసి చూశాడు. 'హ్హా-వచ్చేస్తున్నాం. చినబాబుగారూ.

యి...దేయి...సరిగ్గా దేయిలానే ఆనాడూ ఊరి పొలిమేరల్లో అడుగుపెట్టామో లేదో-మేఘాలు క్రమ్ముకుంటూ వచ్చి కుంభవృష్టిగా వాన తగులుకుంది. కారు సగం దారిలోనే బురదలో దిగబడిపోయి ససేమిరా కదలనంది. అదే ఆ తెల్లని ఎత్తైన భవంతి కనిపిస్తోందే అదే ధర్మరాజు మేడ. అదేదో చాలా ముఖ్యమైన కేసు. ఆ కేసులో నిష్కారణంగా ఒక బ్రాహ్మణకుటుంబం ఇరుక్కుని ఛిన్నాభిన్నమై సర్వనాశనమైపోయింది.

గతుకుల్లోంచి మిట్టపల్లాల్లోంచి కారు ఊళ్లోకి రాగానే పిల్లలు గొడ్లకాడి కుర్రవాళ్లు కేకలేసుగుంటూ కారు వెనక్కాలే పరుగులెట్టసాగారు. అరుగులమీదకు వచ్చి ముఖానికి చేతులడ్డం చేసుకుని జనం కొంచెం దిగ్భ్రమచెందినట్లుగా నిలబడిపోయి చూస్తున్నారు. గ్రామం మధ్య పాఠశాలదాపుకు రాగానే కారు నిలబడిపోయింది. రాజు రబ్బరుకోటును లోపల్నే వదిలి తలుపు తెర్చుకుని బైటకు వచ్చాడు. ధర్మయ్య కారులో బెర్తుక్రింద రహస్యంగా దాచిన అందమైన చిన్న క్యాలికో చెక్క పెట్టెను చేతపుచ్చుగుని 'ఇది పట్టుగోండి చినబాబుగారూ! రాధాదేవి ఆఖరికోరిక....'

ఇరువురూ తల కాస్తవంచి పాఠశాలలోపలకు దూరారు. అది తాటియాకుల పురాతనపుశాల-వెదురుబద్దల్ను చీల్చి జాఫరీలా అల్లి ఆ పాకను రెండుమూడు భాగాలుగా విడదీశారు. నేలంతా మన్ను. బల్లలు లేవు పిల్లలు కూర్చుందుకు. అంతా చింకిచింకి గోనెలమీద పలకలూ, పుస్తకాలూ పర్చుగుని సరస్వతీపూజ చేస్తున్నారు. పంతులుగారి డ్రాయరు నల్లగా కొరకంచులా వెలవెలబోతూ ఉంది. ఆయనకు కూర్చునేందుకు కుర్చీలేకనో మరే కారణంచేతనో చెక్కపెట్టి నొకదాన్ని బోర్లించి దానిమీద అధివసించి వుండటం మాత్రం నిజం. మాస్టరుగారు కళ్లజోడు ముక్కు మీద నుంచి జారిపోతూండగా కంగారుగా లేచారు. పిల్లలుకూడా లేచినిలబడ్డారు. ధర్మయ్య ఎదురువెళ్ళి పంతులుగార్ని ప్రక్కగా తీసుకెళ్ళి 'రాధమ్మ సవతి కొడుకు బాబూ-తమరితో వనుండి వచ్చారు.'

మాస్టరుగారు క్షణకాలం 'హ్హా' అని తెరిచిననోరును అల్లాగే ఉంచి 'వస్తున్నాను బాబూ-' అని పిల్లల్నీ పదినిముషాలపాటు లోపల చదువుకొంటూండమని చెప్పి 'రండిబాబూ! ఈ పేదవాడి కొంప తమబోంట్లు మెట్టదగినది కాదుగానీ మా రాధాదేవి తరఫునుంచి వచ్చాక ముందు ముఖ్యమైనది మీ పని చూశాకే.'

కారు నిర్లక్ష్యంగా పరుగెత్తి ధర్మరాజు మేడనుచుట్టి ఊరికి రెండవతట్టున మట్టిఅరుగులతో శుభ్రంగా అలికి ముగ్గులు తీర్చిన ఓ పెంకుటింటిముందు వచ్చి ఆగింది. ముగ్గురూ దిగి ఈవలకువచ్చాక-ధర్మయ్య 'ఇక్కడే ఇక్కడే బాబూ రాధమ్మను తొలిసారి చూసింది. అవునా-పంతులుగారూ నన్ను పోలికపట్టారా?'

పంతులుగారు కళ్లజోడులోంచి తేరిపారజూచి 'అవునవును-దాసుగారితోకూడా వచ్చింది నువ్వేగదూ? ఏవిమంచి-ఎంతచాకిరీ చేశారు బాబూ?' అని రాజునుద్దేశించి

దాసుగారిది ఎంతజాలిగుండె-మూగమొద్దు, అది దిక్కు లేనిదైపోతుందని రాధమ్మ జీవితసమస్యను నాపైన వేయండి. నేను చూసుగుంటాను, అని గట్టిగా నొక్కి మరీ చెప్పి కారులో ఆ పిల్లను స్వయంగా తనబంగాళాకు తీసుకుపోయారు. పెళ్లిచేసుకున్నారు. దాని బ్రతుకు కుదుటపడింది. లేకపోతే మూగరాధకు దిక్కా? మొక్కా? కన్ను ముక్కూ తీరు అన్నీ చక్కగా వుండి ధారాళంగా వాక్శుద్ధి గలిగి సలక్షణమైన పిల్లలకే పెండ్లిళ్లు కావటం కష్టమాయె-భగవంతుడున్నాడు సార్. అందుకనే అమాయకులకు దిక్కులేనివాళ్ళకు కష్టంలో ఎవర్నో ఒకర్ని దాసుగారిలాటి మహానుభావుల్ని చూపిస్తుంటారు. అంతా కులాసా బాబూ-లోపలికి దయచేయండి.!

ధర్మయ్య, రాజు, లోనికి అడుగుపెట్టేసరికి చూసిన దృశ్యం తాలూకు సందర్భం ఇది.

ఒక పద్దెనిమిదేళ్ల అమ్మాయి చక్కగా విరబోసుకున్న కుంతలాల్ని చేత్తో సర్దుకుంటూ రెండవచేత్తో తీక్షణంగా తర్జని నెదుట వ్యక్తి పైనిర్దేశిస్తూ ఇలా ధారాళంగా చెప్పుకుపోతున్నది. -

'సెట్టీ నీకు బుద్ధి ఇల్లా గడ్డి తింటున్నదేం? ఎన్నిమాట్లు నీకు కాళ్ల వేళ్ల పడి-ఆ ముసలి దాని చేతులోనుంచి ఏదీ పుచ్చికోవద్దని కచ్చితంగా చెప్పలేదు? ఆ ముసలమ్మ ఎక్కడనుంచో చీరెత్తుకొచ్చి నీకిస్తే ఆ దొంగసొమ్ము పుచ్చుకొని నువ్వు నల్లమందు ఇస్తావూ? అందరికీ తెలుసుగదా మా ముసలమ్మకు బుద్ధిలేదని-వెంటనే నాకు కబురుచెయ్యక కొంపమీదకు తగూలు తెచ్చి ఆనందించటం ఇదా నీ బుద్ధి?'

శెట్టి చిరాగ్గా 'ఇందమ్మోవ్ మీ చీర-నా రెండు రూపాయలూ నాకు పారెయ్యండి. అంత పెద్ద పంతులుగోరితల్లి దొంగతనం చేస్తుందని నాకేవెరిక-నన్నెందుకమ్మా తిడతావు? చేతనైతే మీ ముసలమ్మను సంబాళించుకోరాదూ?

మాస్టారుగారు యీ తగూ మధ్యలోకి వస్తూ 'యిష్...ష్ ఏమిటర్రా ఆగోల? అవతల పెద్ద మనుష్యులు వచ్చి కూర్చుంటేను బయట-ఆపండి. ఏవిటి శెట్టీ తగూ.....'

'రెండురూపాయలిచ్చి చీరపట్టికెళ్ళ మంటున్నాను. మీ అమ్మగోరు చీరెత్తుకొచ్చినారని నాకేం తెలవదు. దొంగసొమ్ము కొంటం నా ఇంటా వంటా లేదు. పెద్దపంతులుగోరి తల్లి గందా అని నల్లమందు ఇచ్చాను. చూడండయ్యాగోరూ మీ జయమ్మగోరెల్లా తిడతావుందో?'

పంతులుగారు నీళ్లు నమలటం ఆరంభించారు.

'ఊరుకో విజయా-లోపలకు నడు. సెట్టీ నువ్వుపద-నీకు రెండు రూపాయలివ్వాలా? జీతం ఫస్టురాగానేక కనిపించు బాబ్బాబు ఎవరో పెద్దమనుష్యులు రాకరాక వాకట్లో కొచ్చారు' అని నూతిదగ్గర పళ్లెంలో కూర్చున్న తల్లి నుద్దేశించి 'ఏవిటే ఈపాడు పనులు?

ఎప్పుడూ ఏదోఒకటి ఎత్తుకొచ్చి నాప్రాణంమీదకు తీసుకురాకపోతే-కుదురుగా కొంపలోపడి యేడవరాదూ? నన్నేం ఊళ్లో తలెత్తుకు తిరగనియ్యరాయేవి ఈ కొంపలోవాళు

'అబ్బే-అంతా ఉట్టిదిరా అబ్బాయి. దొంగతనమా-నాకేం ఖర్మ? కాలూ చెయ్యీ వంగాక కళ్లూ, కాళ్లూ కనిపించక పోయాక ఎన్నైనా అంటారు? రొవ్వంత నల్లమందు పెట్టమంటూ ఇల్లా అడిగానో లేదో చీరెత్తుకొచ్చి తాకట్టు పెట్టిందని అభాండం నా నెత్తిన వేశారు. రామ! రామ!!'

'నువ్వూరుకో నీకు తెలీదు బాబయ్యా-యీ శెట్టికి దొంగ సొమ్ము కొనటం మాబాగా అలవాటయింది. రెండు రూపాయలు గాదు కదా రెండు కాన్లుకూడా ఇవ్వొద్దు-ఎల్లా ఇవ్వడో చీర చూస్తానుగా. పద శెట్టీ. నేను మీయింటి కొస్తున్నాను. ఇంకా ఎక్కువ డబాయించావో నువ్వే దొంగతనాలు చేయిస్తున్నావని కేసు పెట్టిస్తాను. దాంతో తిక్కకాస్తా కుదిరిపోతుంది తెల్సిందా?'

బాబయ్య రెక్కపుచ్చుకు లాగాడు విజయను.

'కాస్తంత నెమ్మదిగా మంచిపిల్లల్లే మాట్లాడు విజయా. నీ కోసం ఎవరో పెద్దమనుష్యులు వచ్చి వాకట్లో కూర్చున్నారు. ఆ జుట్టూ అదీ కాస్త ముడివేసుకుని వోమారు ముఖం కడుక్కుని కాస్త శుభ్రంగా రారాదూ?'

మూతి వంకరగా పెట్టి నడుంమీద చేయి ఆన్చి అదోలా బాబాయికేసి చూసింది.

'అవును. తల్లీ! చుట్టాలొచ్చారు నీకోసం-చప్పున తెవుల్చుకురా.'

'ఎవరు బాబూ-అంత హఠాత్తుగా ఆకాశంమీంచి ఊడిపడిన చుట్టాలు?'

'చెప్తానుగా-మంచినీళ్లు కాస్త ఫలహారం ఏమన్నావుంటే చూడు తల్లీ.'

బాబయ్య పడవలోకి తప్పుగున్నాడు అతిథుల్నీ పరామర్శించేందుకు. విజయ నీళ్లతో ముఖం కడుక్కుని చప్పున పడేసి, ఆదరా బాదరా చీరమార్చుకుని, పొయ్యి ఎగసనదోసి టీనీళ్లు పడేసి, వంటయింటిగూట్లో సజ్జలోంచి రెండు రెండు అరటిపళ్లూ రెండేసి మినపసున్ని వుండలూ పళ్లెరంలో పెట్టుగుని-మంచినీళ్ళ గ్లాసు చెంబు ఓచేత్తో పుచ్చుగుని, ఎవరా ఆవచ్చిన చుట్టాలనుకుంటూ పడవలోకి కాలుపెట్టగానే-మన్ను గొట్టుకుపోయిన ముఖం విషాదాక్రాంతమైన చూడ్కులతో, బల్లమీద నేరస్థుడిలా కూర్చున్న రాజేశ్వరరావుని నేలమీద చాపమీద భాసింపట్టు వేసుగు కూర్చున్న ధర్మయ్య యీ రెండు కనీ వినీ ఎరుగని క్రొత్త మొహాల్ని చూడగానే క్షణంసేపు తటపటాయించి బాబయ్య ముఖంలోకి చూసింది.

రాజేశ్వరరావు పెదిమ కొరుక్కుంటూ భయంభయంగా తలెత్తి విజయముఖంలోకి చూసాడు. అదే పోలిక-అవే చక్రాల్లాటి విశాలమైన నయనాలు. అదే దేహకాంతి-సరిగ్గా రాధాదేవి నడచివచ్చినట్లుగానే ఉంది.

'చిన్న బాబుగారూ-చూశారా! ఆయమ్మ ఈయమ్మే.... అదే పోలికని అచ్చుగుద్ది పడేశాడు భగవంతుడు.'

'నువ్వన్నా చెప్పు ధర్మయ్యా-నేను చెప్పలేను.'

రాజు రెండుచేతుల్తో ముఖాన్ని కప్పుకుని భోరునవస్తున్న దుఃఖాన్ని ఆపుగుంటున్నాడు. విజయి చలితమనస్కయై, అయోమయంగా, నిలబడిపోయినది, మంచినీళ్లను చాపమీద ఉంచుతూ. ఫలహారపు పళ్లెరాల్ని బల్లమీద ఉంచబోయింది.

'అఖ్ఖర్లేదు తల్లీ. మంచిమాట చెప్పిపోవటానికి రాలేదు. దుఃఖవార్త మోసుగొచ్చామమ్మా నీకోసం'-

రాజు తడబడ్తూ లేవబోయి మళ్లీ బల్లమీద ఎవరో వెనక్కి త్రోసినట్లు కూలబడ్డాడు. పంతులుగారు తెల్లబోయి నిలువు గ్రుడ్లేసుకుని చూస్తున్నారు. అతను అతికష్టం మీద అందమైన చిన్న క్యాలికో చెక్క పెట్టెను ఒణుకుతున్న చేత్తో అందిస్తూ' ఇది నీ కివ్వమని చెప్పిపోయిందమ్మా మీ అక్క. తీసిచూసుకో... మాస్టారూ మీ రాధమ్మ వెళ్ళిపోయిందండీ. పాపం మానాన్న గారి ఔదార్యాన్ని చాలా ప్రశంసించారు. ఎవరి ఔదార్యంతోనూ నిమిత్తం లేకుండా ఆమె నిష్కంటకమైన మార్గాన్నే చూసుగుంది.'

విజయ కాంతివంతమైన ముఖమండలం నల్లగా పొగచూరినట్లయిపోయింది. ఆ చేతిలోని పెట్టెను భద్రంగా విప్పి అందులోంచి తీసిన వెండిచెట్టు తీగతో అరిగిపోయి వెలవెల బారుతోన్న పొగడాల దండవైపు అందరూ క్షణకాలం ప్రశ్నార్థకంగా చూశారు. విజయకళ్లలో నీరు, చుట్టుగుంటూండగా-

'ఇది మా అమ్మ వేసుకునే పొగడాలదండ-ఎంత గుర్తుగా దాచిపెట్టింది. మా అక్క పాపం! మాట్లాడలేకపోయినా ఇది భద్రంగా దాచుకుని మమ్మల్ని జ్ఞాపకం చేసుకునేది కాబోలు...నాకోసం పం.....పిం....చిం....ది. ఇదే మాకు చివరి గుర్తు. ఇదే మాకు సంబంధం....చివరికింతకన్నా ఏమీ మిగలలేదు.' తలుపుని కర్చుకుని విజయ పొగడాలదండను వ్రేళ్లతో చేతికిచుట్టుగుంటూ రుద్ధకంఠంతో-' ఏదో గొప్ప ఇంట్లోకి వెళ్లిపోయిందన్న తృప్తితో మమ్మల్ని మభ్యపెట్టి బ్రతికివున్నన్నాళ్లూ మమ్మల్ని శాశ్వతంగా ఒకర్నొకరు చూసుగోనీయకుండా చేశారు మీ నాన్నగారు. మాట్లాడ్డం రాని మా అక్కను మీ హోదాలు అంతస్తుల్లో కట్టేసి శాశ్వతమైన బందీని చేసేసారు. పోనీలెండి మీకటకటాల్ను త్రెంచుకుని ఈ క్రూరమైన ఆంక్షల్నుంచి కాంక్షల్నుండి రెక్కలు వచ్చిన పిట్టలా ఎగిరి చక్కాపోయింది. మీరీకబురు మోసుకురాకపోయి ఉండినట్లయితే ఇంకా ఎక్కడో మా రాధ మూగబాధలు అనుభవిస్తూన్నదనే అనుకునేవాళ్లం.' దు:ఖం నిండి ఆమె గొంతుక పూడిపోయింది. ధర్మయ్య గుడ్లప్పగించి చూస్తున్నాడు. చెరగుతో ముఖాన్ని రుద్దుకుంటూ పరుషంగా-'మా దు:ఖంలో మేము మునిగి ఉన్నాము. అప్పుడు ధర్మరాజుగారు మా

నాన్న మీద కేసు నడుపుతున్నాడు. ఆయన కొలువులో ఉన్నప్పుడు శిస్తులు వసూలు చేసిన బాపతు పదిహేను వేలదాకా మానాన్న గార్ని లెక్క చెప్పవలసిందని లేకపోతే జైలు తప్పదని ఆయన్ని బెంగలో ముంచేశారు. ఆ కేసులో మా నాన్నగారు ధర్మరాజు గారి సొమ్మే తినేసివుంటే ఈ గర్భదారిద్ర్యం-గుండెలు పగిలి మానాన్న చావవలసి రావటం ఎందుకు? ఈ మాట ఎవరూ నమ్మారు కారు. ఆయనెక్కడో ఈ డబ్బు దాచుకున్నాడని అనుమానం అందరికీనూ. చివరికి మరణావస్థలో క్రింద పడేసినప్పుడు శోకసముద్రములో మునిగిపోయిన మమ్మల్ని కడుదయతో మీనాన్న గారు వచ్చి బుజ్జగించి పదేళ్ళదాన్ని నన్ను యీ బాబయ్యగారి వశంచేసి తానే మా రాధమ్మను కారెక్కించుకుని పట్నం తీసుకెళ్ళి పోయి పెళ్లాడేసాడు. ఎంత గొప్ప సంస్కర్త? ఏమిజాలి? అని అంతా మెచ్చుకోవటమే-నోరులేని మా అక్క యేమని చెప్పుకోగలదు? ఎవరున్నారిక్కడ ఆదరించేందుకు? పేదవాళ్లమని దిక్కులేదని, మూగపిల్లని ఎవరేం చేసుకుంటారని గప్ చిప్‌గా అందరూ వెనక్కు జారుకుంటే మా అక్కను హరించుకుపోయి దాని బ్రతుకు అర్పి వేశారు మీ నాన్నగారు. సంఘంలో ఆడదానికి జీవితం బలీపీఠమయిపోయిందే? ఓహో ఏమి విశాలహృదయం? మీడ్రైవరు పాపారావని అతను వచ్చి చెప్పాడు. దాసుగారు రాధతాలూకు మనుష్యులెవ్వరూ ఎప్పుడూ బంగాళా పొలిమేరలు త్రొక్క వల్లకాదని కబురు పంపించారు. ఆయనే మనిషి? మావి మనుష్య జీవితాలు. కావు-ఆటబొమ్మలనుకుంటున్నారా? పేదరికంతో పరిహాసాలాడ్తారా? మా దు:ఖం, మా కన్నీళ్లు బాధలూ వుప్పెనలా వచ్చి మిమ్మల్ని ముంచెత్తేస్తాయని నేనన్నానని మీ నాన్నగారితో చెప్పండి'-

ఎడాపెడా లెంపకాయ కొట్టినట్లనిపించి వళ్లంతా జలదరించింది రాజుకు. ధర్మయ్య పంతులుగారి నుద్దేశించి 'ఈ పొగడదండను అబ్బాయి పట్టుగెల్లి ఈ చెల్లాయి కిచ్చిరావాలని రాధమ్మ కోరిక-ఈ అమ్మని ఎంత ఎత్తుగా మనస్సులో తల్చుకునేదో అంత ఎత్తునే ఈ అబ్బాయిగార్ని రాధమ్మ ఆపేక్షగా చూసుకుంది. చివరికి ఒక్కరూ కంటికి కనిపించకుండానే బ్రతుకు తెల్లార్చేసింది.'

పంతులుగారు నెమ్మదిగా విజయనుద్దేశించి-ఇంటికివచ్చిన అతిథుల్ని కోపంగా నాలుగుమాటలన్నావుగదా చాలు! మంచి చల్లని ముక్కలు కూడా రెండు చెప్పుతల్లీ!'

'చినబాబుగారూ! మనం వచ్చినపని అయిపోయినట్లే-మీకెప్పుడు రాధమ్మగార్ని చూడాలనిపించినా, పడితే నాలుగు మాటలు ఓర్చుకునీ ఇక్కడకు వచ్చినట్లయితే మీకనువాపిరి తీరిపోతుంది. లెండి-అమ్మాయిగారూ! మీ రాధమ్మకు ప్రియమైన వస్తువులు రెండు తెచ్చాము-ఒకటి మీకిచ్చి రెండవది మాతో తీసుకు వెళ్ళిపోతున్నాము.'

రాజు నీరసంగా లేచి 'మాటల్ని పడ్డానికి నేనెప్పుడూ వెనుకాడను. విషభాండాల్లాంటి అభాండాలు నా నెత్తిన ఎప్పుడూ పగుల్తూంటాయి.'

విజయ పొగడదండను క్యాలికో చెక్క పెట్టెలో ఉంచి మూతవేస్తూ-'మీ రెండు వస్తువులూ మీదగ్గిర్నే ఉండనివ్వండి-ఇదొక్కటే పాపం ఇక్కడెందుకు?' అని ఆ పెట్టెను జాపిన అతడి చేతిలో ఉంచుతూ అప్రయత్నంగానే అతడిచేయి తగులగానే-

'అమ్మబాబో ఎంత వేడిగావుందో-జ్వరం కాదుగదా?' అని పెట్టెతో సహా షాకుతిన్నట్లయి చేతిని వెనక్కు లాగేసుకుంది. ధర్మయ్య రాజు నుదిటిమీద చేయివేసి 'అమ్మాయిగారూ మీరు చెప్పింది నిజమే-జ్వరం నాగుబాములా ప్రాకింది. పదండి కారులో రెండుగంటల్లో వెళ్ళిపోతాము.'

పంతులుగారు రాజును ముట్టుకుని నాడీ పరీక్షచేసి అన్నారు. 'చాలా నీరసంగా ఉంది' అని. రాజు దృష్టి పళ్లెరంలోని మినపసున్ని ఉండమీద పడింది. వంగుని దాన్ని అందుకోబోతూండగా విజయ చర్రున పళ్లెరాన్ని ప్రక్కకు లాగేస్తూ 'అమ్మో' ఇంకేమన్నా ఉందా-మినపసున్ని తింటే జ్వరం ఒంటిమీద కొంపమునిగిపోదూ.'

'మునిగిపోయేదేమీ ఉండదులే-' అని చిన్నగా నవ్వాడు రాజు. పంతులుగారు బైటకువెళ్ళి కారుచుట్టూ చేరిన కుర్రమూకను బెదిరించి స్కూలుకువెళ్లి నలుగురుపిల్లల్ని కాపలా కాస్తూండమని బండిదగ్గరకు పంపించారు. విజయ తన చల్లనిహస్తాలతో మెత్తటి ప్రక్కను పర్చి తల బ్రద్దలుకొట్టేస్తున్నదని రాజు గోల పెట్టేస్తుండగా బలవంతాన నూరుకొచ్చి కంట్లో కలికం పెట్టేసింది. రాజు అమ్మో! అమ్మో! అని వాపోతుండగా 'చూడండి. మీతో నాకేం విరోధం లేదు. గంటసేపటికల్లా మీ శిరోభారం యావత్తూ దిగజారిపోతుంటే నన్ను విజయా అని పిలవకండి.' బయట అరుగుమీద ధర్మయ్యను ఆ ఇంట్లో ముసలమ్మ తానేమీ చీర దొంగిలించుకు రాలేదనీ నల్లమందు అమ్మే కోమటిమాటలన్నీ బూటకమనీ అవేవీ నమ్మవద్దనీ నచ్చచెబుతోంది.

## 3

ఇంకా వెఱ్ఱిగాలి ఉండిఉండి వీస్తూనేవుంది. కారు నిర్లక్ష్యంగా జలజలమని పారే బురదనీటిని చిందగొడ్తూ వెళ్లిపోయింది. రామదాసుగారు టక్కున తలను ఈవలకు లాక్కుని కిటికీ మూసేశారు. గదిలో చిమ్మచీకటి-గుమ్మానికి కట్టిన తెరలు స్వేచ్ఛ కోసం గింజులాడుకొంటున్నాయి. లాంగుగౌనులో ఆయన దేహం కజకజలాడింది. పైపుతీసి బాగా రెండుమూడు దమ్ములు పీల్చి అద్దంముందు వచ్చి నిలబడ్డారు. మసగమసగ్గా నల్లటి భయంకరమైన నీడ అద్దంలో గోచరించింది. తల గిర్రున తిరిగిపోతోంది. బంగళా యావత్తూ కెఱటాల్లో ఊగిసలాడ్తున్న నావలా తోచింది. క్రమంగా ఆయనకు భయం లోపల క్రమ్మసాగింది. అలమార్లోంచి తాళాలుతీసి బీరువా తెరిచారు. వణుకుతున్న చేతుల్తో నోట్ల కట్టల్ని ఈవలకు లాగారు. మళ్ళీ తాళం వెయ్యలేదు. టేబిలు మీద కాస్సేపు తడిమారు. టక్కున బల్లమీద దీపం వెలిగి ఉలిక్కి పడ్డారు. ఒక్కమాటు నేలమీద కూర్చుని

మంచంక్రింద చూశారు. చుక్కల చుక్కల జాకెట్టు రాధాదేవిది మూలను గోడవారను దిగువకు వ్రేలాడుతోంది. కళ్లు గట్టిగా మూసుగుని బలవంతాన ఒక గుంజీ తీసినట్లు లేచి నిల్చొని హాల్లోకి వచ్చేసారు. ఎదురుగుండా పెద్దభార్య తాలూకు తైలవర్ణ చిత్రంలోంచి ఆ యిల్లాలు పెద్ద తరహా చీరకట్టు, ఒంటినిండా ఒంటిడు నగలు, అర్ధణా కాసంత కుంకుమబొట్టు-ముఖాన గౌరవనీయమైన ముడతలు గీతలతో, 'నేనంతా కనిపెడ్తున్నాను సుమా-' అని పలకరిస్తూన్నట్లుంది. దాసుగారు తీవ్రంగా విసుక్కున్నారు. 'యీ పీడబొమ్మ వ్రాయించకపోయినా బాగుండిపోయేదని' కంగారుగా అద్దాల తలుపుల కిటికీవద్దకువచ్చి నిలబడ్డారు. ప్రక్కనే తన్ను రాసుగుని ఎవరో దూసుకు వెళ్లినట్లయింది. అర్థంకాని మూగబాధను వ్యక్తం చేస్తూన్న రెండు సజలనయనాలు కిటికీ అవతలనుండి తన్ను చూస్తున్నాయి. గబగబా చేతుల్తో గోడలన్నీ తడిమారు. హాల్లో లైట్లు హటాత్తుగా వెలిగాయి. కళ్లకడ్డంగా రాజు బెడ్డింగు ట్రంకుపెట్టి కదలనిచ్చేట్టు లేవు. మూగపిల్ల రాధాదేవిని ఆక్రమించుగుని అనుభవించి ధ్వంసంచేసిన నేరానికి-రాజుకి దయలేదు. ఒక్కనాటికి తన్ను క్షమించడు. ధర్మయ్యకూడా వెళ్ళిపోయాడు. తన పాపాల ఘోరమైన చిట్టా అంతా క్రమం తప్పకుండా వ్రాసిఉంచిన చిత్రగుప్తుడు. దాసుగారు కళ్లు గట్టిగా మూసుగున్నారు. ఆయన మనోనేత్రాలముందు చిత్రపటంలోలా ధర్మరాజు కేసులోపడి నలిగి నాశనమైన రాధాదేవి తండ్రి చావు ప్రత్యక్షం కాసాగింది. భోరున ఆ రోజు కురిసిన వానలో కూరుకుపోయిన కారులోంచి దిగి పన్నిన పన్నాగంలో ఇరుక్కున్న పదహారేళ్ల జవ్వని బ్రతుకుభారం చేత చిక్కించుకున్న వైనం-కొఱకంచుల్లోంచి కాల్తున్న మందభాగ్యుడు నిప్పుముద్దల్ని విసరి తిరుగని శాపం విసర్తున్నాడు. ఆ మూగపిల్ల అందమైన ముఖం, పెద్దపెద్ద కళ్లు, వినీలకుంతలాలు, చక్కగా వంపులు తిరిగిన పెదవులు-బలిష్టమైన శరీరం ఆకుదింపు ఆ యవ్వనాన్ని కబళించాలనే దాహం ముందు-బలిగావించబడ్డ క్రూరంగా వంచింపబడిన పేగు సంబంధం-దారి కద్దుకాబోయిన పాపారావు మీసాలు. ఒకడు ఉద్యోగం నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించబడ్డాడు. రెండవవాడు లజ్జతో తలవంచుగుని పెట్టీ బేడా సర్దుకుని కంటికి కనపడకుండా కలకత్తా పారిపోయాడు. పారిపోయినవాడు మళ్లీ వచ్చాడు. ఈ ధర్మయ్య ఎంతకైనా తగును. వీడే పిలిపించాడు. దాసుగారు పళ్లు పటపటా పిండుకొని పిస్తోలు కోసం కోటుజేబుల్ని తడువుకున్నారు. ఆ క్షణంలో ఆయనకు పిస్తోలు చాలా అవసరమనిపించింది. వెంటనే పడకగదిలోకి పరుగెత్తి ఠక్కున ఆగిపోయారు. బీరువా తలుపులు తెర్చేవున్నాయి. దీపం ఖణీగా వెలుగుతోంది. గదిలో ఎవరో దూరినట్లు అనుమానం వేసింది. ముందుకీ వెనక్కీ చూసి పగలబడి నవ్వబోయి నవ్వురాక బీరువాలోంచి బ్రాందీబుడ్డీ తీసి తాళం గుత్తులతో కార్కు పీకి పారేసి అలమార్లోని గ్లాసును తెచ్చి వంపుకుని గటగట గుక్క మీద గుక్క పీల్చేసి పిస్తోలు కోసం అరల్లో

తడుముళ్ళాడి మొత్తానికి తూటాలు నింపుతూండగా 'జిమ్మీ' భయంకరమైన అరుపు దాసుగార్ని వివశుల్ని చేసిపారేసింది. కోపంగా ఆయన మెట్లవద్దకు పరుగెట్టారు. పెద్ద చప్పుడు చేసుగుంటూ దిగి పిడికిలితో గాజు తలుపును గ్రుద్ది ముక్కలు చేసి పిస్తోలును హాల్లోకి సూటిగా మూడు మార్లు ధామ్మనిపించారు. పెద్ద చప్పుడయింది. ఏ బీరువాయో బ్రద్దలయింది.. జిమ్మీ ఇంకా బిగ్గరగా గది అంతా విశృంఖలంగా తిరుగుతూ అరుస్తోంది. దానికీ తగిలుండాలి-చావలేదు. వరండాలో దీపం వెలిగించటానికి దాసుగారికి ధైర్యం చాలలేదు. తలుపుల్నీ తెరిస్తే జిమ్మీ పట్టుగుంటుంది-ఛీ! ఇంత బ్రతుకూ బ్రతికి చివరికి కుక్క చేతిలోనా ఛావు! వెనక్కు తిరిగి హాల్లోకి రాగానే అద్భుతమైన యోచన బుర్రలో మెరిసింది. గదిలోకి పోయి ప్రయాణపు సంచీ తెచ్చి కొన్ని బట్టలు నోట్లకట్టలు అందులో కుక్కి తాళాలు తతిమ్మావి ఎక్కడికక్కడ వదిలేసి పలాయనానికి సిద్ధపడ్డారు. పిస్తోలు ఇంకా చేతిలోనేఉంది. అద్దానికి ముఖాన్ని ఆన్చి బయటకుచూశారు. చీకటి మసగమసగ్గానే ఉంది.

దాసుగారు మెట్లుదిగి వరండాలోంచి నెమ్మదిగా దొంగలా నక్కి నక్కి తోటలోంచి గేటువైపుకు నడకసాగించారు. హఠాత్తుగా వెనకనుంచి వచ్చి పట్టుగుంది 'జిమ్మీ'-జిమ్మీ ఎల్లావచ్చింది? కిటికీ బ్రద్దలయివుంటుంది. అబ్బా గట్టిగా పట్టుగుందే? దాసుగారు పిస్తోలును ధామ్మని పేల్చబోయారు. తూటాలు ఖాళీ.... అయ్యో! అయ్యో!! అయ్యో!!! ప్రయాణపు సంచీ పడిపోయింది. జిమ్మీ కాళ్లను పట్టుగు పీకేస్తోంది. దాసుగారు విడిపించుకోలేక బోర్లాపడ్డారు మొక్కల్లో. భీకరంగా అరుస్తున్నారు. ఆ ఒంటరి బంగళా ఆయన ఆక్రందనాలకు దద్దరిల్లిపోతోంది. ఈ వెధవ కుక్క చేతిలో చావు ఎల్లాగూ తప్పనట్లుందే-ముష్టాముష్టి యుద్ధం ఆరంభమయింది. గోళ్లతో గుండెల్ను రక్కుతూ యధేచ్ఛగా చేతుల్ని కరిచేస్తోంది. దేహమంతా రక్తాలు గాట్లు-కాళ్లు పీకేసింది. చేతుల్ని కొరికేసింది. అయ్యో! అయ్యో! బాధ-బాధ-ఎవ్వరూ లేరు. ఎంత దిక్కుమాలిన చావు? గోండ్రింపు ఆరంభమయింది. పరుగెత్తలేను-పారిపోలేను-ఎవరో పగదీర్చుకుంటున్నారు? జన్మ జన్మాల కసి-కాలభైరవుడి వాత-అయ్యో ఈ దిక్కుమాలిన శవాన్ని చూసి ఎవరు జాలిపడ్తారు? ఎవరొక కన్నీటిబొట్టు రాలుస్తారు? ఈ మొక్కల్లో తుప్పల్లో.... జిమ్మీ దాసుగారి దేహాన్ని ఇష్టం వచ్చినట్లు తుండీలు తుండీలుగా కొరికి కాళ్ళతో బంతిలాగతోన్తూ గంటా గంటన్నర చిత్రవధ చేసి తిన్నగా గేటువైపు పరిగెత్తి శ్మశానం రోడ్డుచ్చుకుంది.

భళ్లున తెల్లవారింది. సూర్యుడు ఫెళ్లున కాస్తున్నాడు. దాసు గారు దేహం నుండి వరదలుకట్టి తెట్టెలు తెట్టెలుగా గడ్డిలో మొక్కల్లో ఇనికిపోయిన నెత్తురు తళతళా మెరుస్తున్నది. పిస్తోలు ప్రక్కగా నేలమీద పడిపోయి ఉంది. ప్రయాణపు సంచీ ఇంకా కొంచెం దూరంగా విసరివేయబడిఉంది. అందులోంచి నోట్ల కట్టలు పొట్టల్ని విచ్చుగుని సూర్యుడ్ని

చూస్తున్నాయి. దాసుగారి నిలువుగ్రుడ్లుమాత్రం భీతావహంగా మొక్కల్ని పరికిస్తున్నాయి. బంగళాలోకి పది పదిన్నర వరకూ ఎవ్వరూ రాలేదు. ఆ తర్వాత పదకొండూ ఆ ప్రాంతాల ఒక సైకిలువచ్చి ఆగింది. పోస్టు జవాను గేటుదాటి లోపలకు అడుగుపెట్టి కెవ్వున కేకేసి వీధిలోకి పారిపోయి పదిమందిని ప్రోగుచేసుకొచ్చాడు. ఆ వెనుక పోలీసు వాళ్లు వచ్చారు. బంగళా అంతా కలయతిరిగారు. అంతా ఖాళీ. నిశ్శబ్దంగా ఉంది. క్రింద హాలువెనుక కిటికీ విచ్చిపోయి ఉంది. ఆ కంతల్లోంచి లోనికి చూస్తే బీరువాలు పగిలిపోయి అద్దాలు ముక్కలు ముక్కలయి నానాభీభత్సంగానూ వుంది. అంతా ఆశ్చర్యపోయారు. పైన మేడమీది గదుల్లో బీర్వా అలమారాల తలుపులన్నీ తీసిఉన్నాయి. కార్కు విసిరివేయబడ్డ ఖాళీ బ్రాందిసీసా టేబిలు మీద వుంది? టేబిలులైటు హాల్లోని లైట్లన్నీ అట్లానే వెలుగు తున్నాయి. షెడ్డు ఖాళీగా వుంది. అక్కడ ఉండవలసిన కారు కూడా లేదు. కారుపోయిన మార్గం గుర్తుపెట్టుకుని పోలీసులు తిన్నగా శ్మశానానికి వెళ్లారు. అక్కడ హంతకుడు నిశ్చితంగా నిర్వికారంగా నోటినిండా ముఖం నిండా నెత్తుటి మరకలతో ప్రత్యక్షమయ్యాడు. కారులో వచ్చింది కుక్కగాదని తెలిసిపోయింది. కాటికాపరిని అడిగారు. రాత్రి ఎవరో వచ్చి కాస్సేపు విచారించి వెళ్లారని తెలిసింది. పోలీసు అధికారులు కారునెంబరు ఇచ్చి మోటారు సైకిళ్లను నాలుగువైపులకూ త్రిప్పారు. సాయంత్రం మూడుగంటలకు ధర్మయ్యనూ రాజేశ్వరరావును కలుసుగుని పోలీసులు ఈ దుర్వార్తను విన్నవించారు. రాజు కళ్లు బైరులుకమ్మి తలతిరిగి పడిపోయాడు. విజయకూడా వస్తానంటే రాజు ధర్మయ్య వారించారు. సరిగ్గా నాలుగు గంటలకు ధర్మయ్య రాజు వచ్చి బంగళాముందు కారులోంచి దిగారు. పోలీసు అధికారులు చుట్టుముట్టి ప్రశ్నల వర్షాలు కురిపించారు. వాగ్మూలాలు రాసుగున్నారు. జిమ్మీని పోలీసువానులో ఎక్కించుకొని వచ్చారు. రాజును చూడగానే దిగులుగా ఉన్నదల్లా సంతోషంతో తోకాడిస్తూ మూలిగింది. దానిక్కూడా గుండుదెబ్బ తగిలినట్లు గాయాలు స్పష్టంగా చెబుతున్నాయి.

ఈ కబురప్పుడే ఊరంతా ప్రాకిపోయింది. జనం తండోపతండాలుగా ఈ ఒంటరిబంగళా చూడ్డానికి రాసాగారు. పత్రికలవాళ్లు రాజును పీక్కుతింటం ఆరంభించారు. ప్రెస్ ఫోటో గ్రాఫర్లు 'జిమ్మీ' ఫోటోలు తీసుకుని దాసుగారి శవం ఫోటోతో సహా వార్తల్ను ప్రచురించారు. బంగళాను సీలువేసి పోలీసు కాపలా పెట్టారు. ధర్మయ్య రాజూ పోలీసుస్టేషను చుట్టూ కోర్టుల చుట్టూ కాళ్లు బలపాలుకట్టేలా తిరిగారు. కేసు పరిష్కారమయ్యేసరికి దాసుగారి కుటుంబ కథనం యావత్తూ పత్రికల్లో వింత వింత శీర్షికల్లో ప్రజలు చదివి ఆనందించారు. రాజు బాగా కృంగిపోయాడు. ప్రభుత్వం అంతా పరిష్కరించి యావదాస్థిని బంగళాను తిరిగి వప్పగించబోతే రాజు ఆ బంగళాను ఆసుపత్రిగా వాడుకోమని ఆ యావదాస్థినీ ఆ ఆసుపత్రిపరంగా ఖర్చుచేయవలసినదిగా

వ్రాసియిచ్చాడు. ఎంత చెప్పినా వినకుండా పోలీసులు జిమ్మీని కాల్చిపారేసారు. రాజు ఇప్పటికీ ఆ బంగళావైపు పోడు. దాని పేరు తల్చుకుంటే అతనికి స్పృహ తప్పిపోయినంత పనవుతుంది. రాజేశ్వరరావు పట్నంలో పాతిక రూపాయలకు ఇల్లొకటి అద్దెకు తీసుకుని అందులో ప్రాక్టీసు పెట్టాడు. ఆ ఇంట్లో బొత్తిగా వస్తుసామగ్రిలేదు. అక్కణ్ణే అతడికి వివాహంకూడా అయింది. అతడి వివాహానికి పోలీసు అధికారులు పత్రికా విలేఖరులూ ఎక్కువమంది వచ్చారు. ఇప్పటికీ విజయ తనకు తలనొప్పి వస్తే కలికం పెట్టానంటుంది. ధర్మయ్య సుష్టుగా రెండుపూటలా భోంచేసి ఊరంతా తిరిగితిరిగివచ్చి అరుగుమీద తలగుడ్డ పర్చుగుని పరుంటాడు. రాజూ-విజయా ఇద్దరూ సంసారానికి కావలసినవన్నీ స్వయంగా చూసుగుంటారు. ఆమె గీచిగీచి బేరవాడుతుంది. అతను కొసరి కొసరి డబ్బులిస్తూంటాడు. పర్సులో తడి ఆరిపోవటం కూడా కద్దు. చెప్పుకోతగ్గ ప్రాక్టీసు కూడా ఏమీ లేదు. కోర్టుకు కూడా కాలినడకనే వెళ్లి వస్తూంటాడు. ఇద్దరూ అప్పుడప్పుడు సినిమాలకు వెళ్లివస్తూంటారు. ఏవన్నా పేచీలు మంకుపట్లు పడ్తే ధర్మయ్యే కాస్త అప్పుడప్పుడు మధ్యవర్తిత్వం నెరపుతూ ఉంటాడు. జీవితం ఎల్లాగుందని ఎవరూ అడగరు. అడిగితే వేడుకుంటానంటాడు. ఎప్పుడన్నా బజారున పోతూ చట్టున ఆగి, బఠాణీలు కొని జేబులో పోసుగొని-చానాగరం దుకాణం దగ్గర దోసెడు మంచినీళ్ళని నోట్లో పోసుగుని, నిర్విచారంగా కోర్టు నుంచి చవకరకం సిగరెట్టు కాలుస్తూ ఇంటికి పోయే న్యాయవాదిని ఎప్పుడన్నా చూడ్డంగనక సంభవిస్తే అతనే రాజేశ్వరరావని తప్పకుండా గుర్తుపెట్టుకోవలిసుంటుంది.